సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
గురువారం । 10 । అక్టోబర్ । 2024



ఎండాకు వణుకు

ఖరీఫ్ సాగు చేతి కొచ్చే తరుణంలో ఎండాకు తెగులు వెంటాడుతోంది. ఇప్పటి వరకూ ప్రకృతి వైపరీత్యాలతో రైతులు ఇబ్బందులు పడ్డారు.


II లో



భగవంతుడు సర్వాంతర్యామి

భగవంతుడు సర్వాంతర్యామి అని పరిపూర్ణానందస్వామి అన్నారు. కాకినాడ శ్రీ పీఠంలో భక్తులను ఉద్దేశించి మాట్లాడారు.

74 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 74,151 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.90 అడుగులకు నీటిమట్టం చేరింది. డెల్టా కాలువలకు 12,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

తెలుగు అధ్యాపకుల సంఘం ఉపాధ్యక్షుడిగా నల్లా



అమలాపురం టౌన్: ఉభయ తెలుగు రాష్ట్రాల తెలుగు అధ్యాపకుల సంఘం ఉపాధ్యక్షుడిగా అమలాపురానికి చెందిన తెలుగు అధ్యాపకుడు నల్లా నరసింహమూర్తి ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల తెలుగు అధ్యాపకుల సంఘం సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఆయనను పలువురి తెలుగు అధ్యాపకులతో పాటు జిల్లా శ్రీశ్రీ కళావేదిక గౌరవాధ్యక్షుడు, అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ అభినందించారు.

తొలిదండకు రూ.1.03 లక్షలు



గతేడాది దసరా ఊరేగింపులో అమ్మవారి మెడలో దండ

అమలాపురం టౌన్: దసరా ఉరేగింపులో పాల్గొనే రవణం వీధి వాహనమైన మహిషాసురమర్ధిని అమ్మవారి మెడలో వేసే తొలి దండకు బుధవారం వేలం పాట నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది భక్తులు పాల్గొన్నారు. ఆకుల లక్ష్మణరావు అనే భక్తుడు రూ.1.03 లక్షలకు పాడుకుని, అమ్మవారి మెడలో తొలి దండ వేసే అవకాశాన్ని పొందారు. మహిషాసురమర్ధిని అమ్మవారి ప్రతిమకు వేసే తొలి దండకు ఏటా వేలం నిర్వహించడం, భక్తులు పోటాపోటీగా పాల్గొని రూ.లక్షల్లో పాడుకోవడం ఇక్కడి సంప్రదాయం. ఈ నెల 12న జరిగే దసరా ఊరేగింపులో అమ్మవారి మెడలో తొలి దండగానే కాకుండా ఊరేగింపు పూర్తయ్యే వరకూ అంటే 13వ తేదీ ఉదయం వరకూ ఆ దండనే ఉంచడం ఆనవాయితీ. ఊరేగింపులో ఎందరు ఎన్ని దండలు వేసినా వాటిని అమ్మవారి మెడలో కొన్ని క్షణాలు ఉంచి తీసేస్తారు. ఈ వేలం ద్వారా పాడుకున్న తొలి దండ మాత్రం ఊరేగింపు మొదలు నుంచి ముగిసే వరకూ అమ్మ మెడలో మెరుస్తూనే ఉంటుంది.

రజత చీరలో భద్రకాళీ అమ్మవారు



ఐ.పోలవరం: శరన్నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో భద్రకాళి అమ్మవారు బుధవారం రజత చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. తమ్మ రత్నం సమర్పించిన రజత చీరను అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు.

మినీ గోకులం పథకానికి 1,955 దరఖాస్తులు

అమలాపురం టౌన్: జిల్లాలో మినీ గోకులం పథకానికి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించగా ఇప్పటికి 1,955 వచ్చాయని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.వెంకట్రావు తెలిపారు. ఈ మేరకు అమలాపురంలో బుధవారం సాయంత్రం ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 1,075 మినీ గోకులాలను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ఉన్నామన్నారు. దీనిలో భాగంగా ప్రతి మండలానికి కనీసం 50 గోకులాలను నిర్వహించాలని నిర్ణయించామన్నారు. వస్తున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, పశుసంవర్ధక, డ్వామా అధికారులు సంయుక్తంగా తనిఖీ చేస్తున్నారన్నారు. మినీ గోకులం నిర్మించడానికి లబ్ధిదారుడు దిగువ తరగతికి చెంది, సొంత స్థలంతో పాటు పశువులు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి కలవారు ఉపాధి కార్డు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ నకళ్లతో గ్రామ సభ తీర్మానం తీసుకుని సంబంధిత రైతు సేవాకేంద్రం సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఇలా అందజేసిన నకళ్లను పశు వైద్యుడు లేదా ఏడీ పరిశీలించి ఎన్ఆర్ఈజీఎస్ అధికారులకు అందజేస్తారన్నారు. క్షేత్ర స్థాయిలో మరోసారి పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తారని వివరించారు.

దండుకుందామనీ

- మద్యం షాపుల దరఖాస్తులకు గడువు పెంపు
- ఆదాయం పిండుకునేందుకు ప్రభుత్వం ఎత్తుగడ
- ఇప్పటికే జిల్లాలో 2 వేలకు పైగా దరఖాస్తులు
- పెరిగిన గడువుతో 4 వేలకు చేరే అవకాశం



అమలాపురం టౌన్: నిధుల లేమితో ఇబ్బంది పడుతున్న రాష్ట్ర ప్రభుత్వం మద్యం టెండర్లు, దరఖాస్తుల ద్వారా ఆదాయాన్ని పిండుకునేందుకు ఎత్తుగడలు వేస్తోంది. దానికి అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుంటోంది. దీనిలో భాగంగా మద్యం షాపుల టెండర్లకు దరఖాస్తుల గడువును పెంచింది. తద్వారా మరిన్ని మంది దరఖాస్తు చేసుకుంటారని, ఆదాయం పెరుగుతుందని అంచనా వేస్తోంది.

11 వరకూ అవకాశం

ముందుగా ఇచ్చిన షెడ్యూలు ప్రకారం ఈ నెల 9వ తేదీ సాయంత్రంతో దరఖాస్తుల స్వీకరణకు గడువు ముగుస్తుంది. ఈ నెల 11వ తేదీ డ్రా ద్వారా మద్యం దుకాణాల ఎంపిక ప్రకియ చేపడతారు. మద్యం దుకాణాల కోసం టీడీపీ, జనసేన పార్టీల నుంచి ఆశావహులైన మద్యం వ్యాపారుల స్పందన బాగుండడం, దరఖాస్తుల స్వీకరణ జోరుగా ఉండడంతో గడువును మరో రెండు రోజులు పొడిగించింది. దీంతో ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం ఉంది. అలాగే ఈ నెల 11 జరగాల్సిన డ్రా ప్రక్రియ 14వ తేదీకి వాయిదా వేసింది.

దరఖాస్తులు

మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జిల్లాలో మద్యం షాపులకు 3,500 దరఖాస్తులు వస్తాయని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్ అంచనా వేశారు. గడువును మరో రెండు రోజులు పెంచడం వల్ల ఈ సంఖ్య దాదాపు నాలుగు వేలకు చేరుకునే అవకాశం ఉంది. బుధవారం సాయంత్రానికి దరఖాస్తుల సంఖ్య రెండు వేలకు చేరుకుందంటే ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల వంతున నాట్ రిఫండ్‌బుల్ ధరావత్తు రూపంలో రూ.40 కోట్లు జిల్లా నుంచి ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది. పెంచిన గడువు ముగిసే సరికి నాలుగు వేల దరఖాస్తులకు చేరుకుంటే జిల్లా నుంచి కేవలం ధరావత్తుల రూపంలో మొత్తం రూ.80 కోట్ల ఆదాయం సమకూరనుంది.

ఆదాయం పెంచుకునేందుకు..

ప్రభుత్వం ఓ పక్క ఆదాయాన్ని పెంచుకోవాలన్న లక్ష్యంతోనే దరఖాస్తుల గడువు పెంచేసి తద్వారా వచ్చే నాన్ రిఫండ్‌బుల్ పేరుతో రూ.కోట్లు పిండుకోవాలని భావిస్తోంది. జిల్లాలోని 133 దుకాణాలకు కిస్తీ రూపేణా దాదాపు రూ.85 కోట్లు, గడువు ముగింపు నాటికి ముందస్తు అంచనాల ప్రకారం 4 వేల దరఖాస్తులకు చేరుకుంటే వాటి ధరావత్తుల రూపేణా రూ.80 కోట్లు మొత్తం రూ.165 కోట్లు మద్యం కొత్త పాలసీ పుణ్యమా అని ప్రభుత్వానికి ఆదాయం జమ కానుంది.

జిల్లాలో 133 దుకాణాలు

జిల్లాలోని 133 మద్యం దుకాణాలకు లైసెన్స్ ఫీజుల (కిస్తీ) ద్వారా ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం సమకూరనుంది. ఒక్కో మద్యం దుకాణానికి రూ.65 లక్షలు చొప్పున వసూలు చేయనుంది. జిల్లాలోని 133 మద్యం దుకాణాలకు కిస్తీ ద్వారా రూ.85 కోట్లకు పైగా ఆదాయం రానుంది. ఉదాహరణకు జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంలో మద్యం నూతన పాలసీలో ఐదు దుకాణాలు కేటాయించారు. తగ్గేదేలా అన్నట్లు మద్యం వ్యాపార ఆశావహులైన టీడీపీ, జనసేన నాయకులు ఐదు దుకాణాలకు సంబంధించి బుధవారం సాయంత్రానికి ఒక్కో దుకాణానికి సగటున 40 దరఖాస్తులు వేశారు. ఇప్పటికే కేవలం దరావత్తు ద్వారా ఈ ఐదు దుకాణాలకు వచ్చిన దరఖాస్తుల రూపేణా రూ.4 కోట్ల ఆదాయం వచ్చింది. ఇక ఈ దుకాణాలకు కిస్తీగా రూ.65 లక్షల చొప్పున మొత్తం రూ.3.25 కోట్ల ఆదాయం రానుంది. గడువు ఉన్న రానున్న రెండు రోజుల్లో అమలాపురం దుకాణాలకు దరఖాస్తులు మరో 50కి పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

అడ్డదారులు



మద్యం వ్యాపారాన్ని ప్రైవేటు పరం చేసి సిండికేట్ల చేతుల్లో పెట్టడం కోసమే ప్రభుత్వం కొత్త పాలసీని తీసుకువచ్చింది. దాని ద్వారా ఆదాయాన్ని పెంచుకునేందుకు అడ్డదారులు తొక్కుతోంది. మద్యం దుకాణాలకు దరఖాస్తుల గడువును మరో రెండు రోజులు పొడిగించడమే దీనికి నిదర్శనం. మరోపక్క కూటమి నాయకులకు టెండర్లు, సిండికేట్ల అవకాశం ఇస్తూ, వారి ఆదాయాన్ని కూడా పెంచే మార్గాలను ప్రభుత్వమే పరోక్షంగా చూపిస్తోంది.

– తోరం గౌతమ్ రాజా, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

సరస్వతీ.. నమోస్తుతే..

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి సన్నిధిలో జరుగుతున్న శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా బుధవారం సరస్వతీదేవికి చిన్నారులు విశేష పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి, వేద పండితుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సామూహిక అక్షరభ్యాసాల్లో 176 మంది చిన్నారులతో ఓంకార బీజాక్షరాలను వారి తల్లిదండ్రులు దిద్దించారు. తమ చిన్నారులు చదువులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సరస్వతీ దేవికి, విఘ్నేశ్వరస్వామికి మొక్కుకున్నారు. అలాగే స్వామివారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక అభిషేకాల్లో 208 మంది, లక్ష్మీగణపతి హోమంలో 28 మంది, పంచామృతాభిషేకాల్లో ఇద్దరు పాల్గొన్నారు. ఇద్దరు చిన్నారులకు నామకరణం, నలుగురికి అన్నప్రాశన, 16 మందికి తులాభారం నిర్వహించారు 16 మంది కేశఖండన చేయించుకున్నారు. 63 మంది భక్తులు తమ నూతన వాహనాలకు పూజలు చేయించారు. 2,985 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ పూజలు, ప్రసాదం టిక్కెట్లు, అన్నదానం విరాళాల ద్వారా రూ.3,87,078 లభించినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

17 రోజులకే తహసీల్దార్ బదిలీ



తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్యులు

మామిడికుదురు: బాధ్యతలు చేపట్టిన 17 రోజులకే మామిడికుదురు తహసీల్దార్ మృత్యుంజయరావు బదిలీ అయ్యారు. ఆయన ఇక్కడకు రాక ముందు పి.గన్నవరంలో పనిచేశారు. అక్కడ ఓ ప్రజాప్రతినిధి అభ్యంతరం తెలపడంతో బాధ్యతలు చేపట్టిన వారం రోజుల్లోనే మామిడికుదురు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో గత నెల 22వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. కానీ ఇక్కడ కూడా ఎక్కువ రోజులు కొనసాగలేదు. 17 రోజులు పనిచేసిన అనంతరం అతడిని కె.గంగవరం బదిలీ చేశారు. ప్రస్తుతం మామిడికుదురు కొత్త తహసీల్దార్‌గా వైవీ సుబ్రహ్మణ్య ఆచార్యులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అద్దతీగల నుంచి ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆచార్యులు మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రజలకు రెవెన్యూ పరంగా ఏ విధమైన సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటానన్నారు.

600 మంది పోలీసులతో బందోబస్తు



మహిపాలవీధి ఉత్సవ కమిటీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రసాద్, డీఎస్పీ ప్రసాద్

అమలాపురం టౌన్: పట్టణంలో ఏడు వీధుల వాహనాలతో ఈ నెల 12న నిర్వహించే దసరా ఉత్సవాల ఊరేగింపునకు 600 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఏఎస్పీ ఏవీ ఆర్‌పీబీ ప్రసాద్ తెలిపారు. ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు తనతో పాటు డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొంటామన్నారు. ఈ మేరకు ఊరేగింపులు నిర్వహించే ఏడు వీధుల్లో ఏఎస్పీ ప్రసాద్, డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ బుధవారం పర్యటించారు. ఆయా వీధుల ఉత్సవ కమిటీ పెద్దలతో చర్చించారు. ఊరేగింపులు, చెడీ తాలింఖానా ప్రదర్శనలు నిర్వహించే కొంకాపల్లి, మహిపాలవీధి, నల్లా వీధి, గుండు వీధి, రవణం వీధి, రవణం మల్లయ్యవీధి, శ్రీరామపురం ఉత్సవ కమిటీల పెద్దలతో వేర్వేరుగా మాట్లాడారు. శాంతియుత వాతావరణంలో ఊరేగింపులు జరిగేలా ఏడు వీధుల ఉత్సవ కమిటీలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ వీరబాబు, ఎస్సై కిషోర్‌బాబు, ఆయా వీధుల ఉత్సవ కమిటీల పెద్దలు పనసా బుజ్జి, ఆశెట్టి ఆదిబాబు, అబ్బిరెడ్డి సురేష్, రాయుడు సత్యరుషి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై విస్తృత ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రంగారావు

మండపేట: పట్టణంలో ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ టీవీ రంగారావు అన్నారు. విస్తృత ప్రచారం చేయడం ద్వారా ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని సచివాలయం, మున్సిపల్ సిబ్బందికి ఆదేశించారు. ఈ మేరకు కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో బుధవారం శానిటేషన్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు, సచివాలయం సిబ్బందితో సమీక్షించారు. తడి, పొడి చెత్తలను వేరు చేసే విధానం, ప్లాస్టిక్ నిషేధం అమలుకు ఆదేశాలు జారీ చేశారు. పట్టణంలోని 30 వార్డుల్లోనూ మెప్మా ఆర్పీలు అవగాహన కల్పించాలన్నారు. మేజర్ డ్రైనేజీల్లో పూడికలు తీయించాలని, పట్టణంలో సరఫరా చేసే తాగునీటిని ఎప్పటికప్పుడు పరీక్షించాలని, కుళాయి పన్నులు, పాత బకాయిలు లేకుండా వసూలుపై దృష్టి సారించాలని, పట్టణంలోని ఇళ్లు, ఖాళీ స్థలాలకు పన్నులు వేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఈ కె.శ్రీనివాస్, ఏఈ పవన్ కుమార్, ఆర్వో జేవీఎస్ శాస్త్రి, ఆర్ఐ అందే శ్రీనివాస్, టీపీవో శ్రీధర్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు పాల్గొన్నారు.

చెడీ తాలింఖానా.. సాహసానికి చిరునామా



చెడీ తాలింఖానా విద్యను ప్రదర్శిస్తున్న కళాకారులు

అమలాపురం టౌన్: నేలపై మనిషి పడుకుని ఉంటాడు, అతని ఉదరంపై కొబ్బరి కాయ ఉంటుంది. చెడీ తాలింఖానా వీర విద్య ప్రదర్శించే వ్యక్తి కళ్లకు గంతలు కట్టుకుని పట్టా కత్తితో అమాంతంగా మనిషి ఉదరంపై ఉన్న కొబ్బరి కాయను ఒకే ఒక వేటుతో రెండు చెక్కలు చేస్తాడు. చూసేందుకు కొంత గగుర్పాటు, ఉత్కంఠను కలిగించే ఇలాంటి దృశ్యాలు చెడీ తాలింఖానా ప్రదర్శనల్లో అనేకం కనిపిస్తాయి. అమలాపురంలో జరిగే దసరా ఊరేగింపుల్లో చెడీ తాలింఖానా చేసే వ్యక్తుల విన్యాసాల్లో ఇదో సాహసోపేతమైన కళ. స్థానిక మహిపాల వీధి చెడీ తాలింఖానా ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఈ వీధిలోని వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం జరిగిన ముందస్తు శిక్షణలో ఈ ప్రదర్శనలు చేశారు. ఈ నెల 12న అమలాపురంలో జరిగే దసరా ఉత్సవాల ఏడు వీధుల ఊరేగింపుల సమ్మేళనంలో ఇవి కనిపిస్తాయి.

అమెరికా నుంచి అమలాపురానికి..




అమెరికా నుంచి అమలాపురం వచ్చిన అబ్బిరెడ్డి నరసింహారావు, మల్లేష్

అమలాపురం టౌన్: అమలాపురం మహిపాల వీధిలోని అబ్బిరెడ్డి కుటుంబానికి నాలుగు తరాలుగా చెడీ తాలింఖానా చరిత్ర ఉంది. నాలుగో తరంలో అబ్బిరెడ్డి నరసింహారావు, సురేష్, మల్లేష్ సోదరులు. దసరా ఉత్సవాల సందర్భంగా వీరు ఏటా మహిపాల వీధి ఊరేగింపులో చెడీ తాలింఖానా వీరవిద్యను ప్రదర్శిస్తారు. ముగ్గురి సోదరుల్లో సురేష్ అమలాపురంలోనే నివాసం ఉంటున్నారు. మిగిలిన ఇద్దరూ ఉద్యోగాల రీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. అయినా ఏటా దసరా ఉత్సవాలకు అమలాపురానికి వచ్చి చెడీ తాలింఖానా వీరవిద్యను ప్రదర్శిస్తారు. దీనిలో భాగంగా ఈ ఏడాది కూడా అబ్బిరెడ్డి నరసింహారావు, మల్లేష్ మూడు రోజుల కిందటే అమెరికా నుంచి అమలాపురానికి వచ్చారు. దసరా ఉత్సవాల్లో చెడీ తాలింఖానా విద్యను ప్రదర్శించనున్నారు. స్థానిక మహిపాలవీధిలో చెడీ తాలింఖానాకు 1856లో బీజం పడింది. 169 ఏళ్ల చరిత్రలో తొలి తరం గురువు అబ్బిరెడ్డి రామదాసు, రెండో తరం గురువు రామదాసు కుమారుడు నరసింహారావు, మూడో తరం గురువు నరసింహమూర్తి కుమారుడు రామదాసు, నాలుగో తరంగా రామదాసు కుమారులైన నరసింహారావు, సురేష్, మల్లేష్ ప్రస్తుతం మహిపాలవీధి చెడీ తాలింఖానా ప్రదర్శనలను పర్యవేక్షిస్తున్నారు. ఆ వీధిలో మూడు తరాల గురువుల విగ్రహాలను నెలకొల్పారు.

ఇసుక రీచ్‌లలో తవ్వకాలకు చర్యలు

- కలెక్టర్ మహేష్ కుమార్
- అధికారులతో సమీక్ష



జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: జిల్లాలోని 12 ఇసుక రీచ్‌లలో నీటి ప్రవాహం తగ్గగానే ఇసుక తవ్వకాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ఆదేశించారు. ఆయన అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ఆత్రేయపురం, రావులపాలెం, ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల్లో ఇసుక తవ్వకాలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని శాఖల అనుమతులతో 12 ఇసుక రీచ్‌లను గుర్తించామన్నారు. వాటిలో ఇసుకను తవ్వే ఏజెన్సీలు, గుత్తేదారుల ఎంపికకు సంబంధించి విధివిధానాలను జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలోని టెండర్ నోటిఫికేషన్ కమిటీ గురువారంలోపు తయారు చేయాలన్నారు. త్వరలోనే టెండర్ నోటిఫికేషను ఇచ్చి గుత్తేదారులను ఎంపిక చేసి, రీచ్‌లలో ఇసుకను తవ్వే ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. పట్టా భూములలో ఇసుకను తవ్వుకోవడానికి (డికాస్టింగ్ ఆఫ్ సాండ్) రైతులు దరఖాస్తు పెట్టుకుంటారన్నారు. వాటిని జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ పరిశీలించి, ఆయా దరఖాస్తులను జిల్లా స్థాయి ఇసుక కమిటీకి పంపాలన్నారు. రీచ్‌ల నుంచి ఇసుకను బయటకు తీసుకొచ్చేందుకు అవసరమైన ర్యాంప్ పాయింట్లు, యాక్సెస్ రోడ్లు, ఇసుకను నిల్వ చేసేందుకు దగ్గరలోని అనువైన స్టాక్ యార్డులను సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులు గుర్తించాలన్నారు. ప్రతి రోజూ ఉదయం ఆరుగంటల కల్లా ఇసుక నిర్వహణ కార్యకలాపాలు మొదలవ్వాలన్నారు. ఉచిత ఇసుక బుకింగ్, రవాణా తదితర సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లో వివిధ శాఖల సిబ్బందితో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో ఎస్పీ బి.కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, అమలాపురం, కొత్తపేట రామచంద్రపురం రెవెన్యూ డివిజనల్ అధికారులు కె.మాధవి, శ్రీకర్, కతీబ్ కౌసర్ భానో, జిల్లా మైన్స్ అధికారి బి.అశోక్ కుమార్ పాల్గొన్నారు.

14 నుంచి పల్లె పండుగ

ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించే పల్లె పండుగ -పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో ఉపాధి పనులకు ప్రజాప్రతినిధులతో భూమి పూజ నిర్వహించాలని కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం పలు అంశాలపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 315 పంచాయతీల పరిధిలో రూ.54.30 కోట్ల ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో 766 పనులకు పరిపాలనా అనుమతులు ఇచ్చామన్నారు. వీటిలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, సీసీ డ్రైనేజీలు, ప్రహరీలు, పశువుల కోసం గోకులాలు తదితర పనులు ఉన్నాయన్నారు. వీటిలో అత్యధికంగా రూ.50.03 కోట్లతో 84.17 కిలోమీటర్ల మేర జిల్లాలో సీసీ రోడ్ల నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు చేశామన్నారు.

ఉద్యోగమేళాలో 31 మంది ఎంపిక

సాక్షి, అమలాపురం: కలెక్టరేట్‌లోని జిల్లా వికాస కార్యాలయంలో వైభవ్ జ్యువెలర్స్‌లో ఉద్యోగాల భర్తీ కోసం బుధవారం నిర్వహించిన మేళాలో 31 మంది ఎంపిక చేశారు. వీరందరికీ కలెక్టర్ మహేష్ కుమార్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందించారు. మొత్తం 172 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కార్యక్రమంలో జేసీ టి.నిశాంతి, వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు, జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్, వైభవ్ జ్యువెలర్స్ హెచ్‌ఆర్ టీం సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భగవంతుడు సర్వాంతర్యామి



మాట్లాడుతున్న పరిపూర్ణానంద స్వామి

కాకినాడ రూరల్: భగవంతుడు సర్వాంతర్యామి అని పరిపూర్ణానంద స్వామి అన్నారు. కాకినాడ శ్రీ పీఠంలో జరుగుతున్న మహాశక్తి యాగంలో భాగంగా బుధవారం సుమారు 30 వేల మంది విద్యార్థులతో త్రికోటి సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు. సరస్వతీమాత ఫొటో, పూజా సామగ్రిని నిర్వాహకులు అందజేయగా విద్యార్థులు ఈ పూజలో పాల్గొన్నారు. కాకినాడ జిల్లాతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరు కావడంతో శ్రీపీఠం ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. చిన్నారులు సరస్వతీ పూజలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రముఖ తెలుగు కవి, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ వేదవిద్య కూడా సరస్వతీ స్వరూపమే అన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

అక్షరాభ్యాసాలు

శ్రీ పీఠంలోని ఐశ్వర్యాంబిక ఆలయ ప్రాంగణంలో బుధవారం అక్షరాభ్యాసాలు ఘనంగా జరిగాయి. సుమారు 200 మంది చిన్నారులతో వారి తల్లిదండ్రులు అక్షరాలను దిద్దించారు.

15న అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

రామచంద్రపురం రూరల్: అరుణాచలం గిరి ప్రదక్షిణ, స్వామివారి దర్శనం చేసుకునే భక్తుల కోసం ఈ నెల 15వ తేదీన రామచంద్రపురం ఆర్టీసీ డిపో నుంచి సూపర్ లగ్జరీ, పుష్ బ్యాక్ వీడియో కోచ్ బస్సులు బయలుదేరుతున్నాయి. ఈ విషయాన్ని డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు బుధవారం విలేకరులకు తెలిపారు. బస్సులు రామచంద్రపురం నుంచి బయలుదేరి విజయవాడ, శ్రీకాళహస్తి, శ్రీనివాస మంగాపురం (తిరుపతి), కాణిపాకం, అర్ధగిరి ఆంజనేయస్వామి, శ్రీపురం (మహాలక్ష్మి అమ్మవారి బంగారు గుడి) మీదుగా 17వ తేదీకి అరుణాచలం చేరుకుంటాయన్నారు. పౌర్ణమి రోజు అరుణాచలగిరి ప్రదక్షిణ, దర్శనాల అనంతరం కంచి, తిరుత్తణి క్షేత్రాల మీదుగా 18న రామచంద్రపురం తిరిగివస్తాయన్నారు. టిక్కెట్లను బుక్ చేసుకునేందుకు 73829 12064, 99489 39888, 73829 12146, 94939 53838, 73829 10769, 73829 15520 నంబర్లను సంప్రదించాలన్నారు. టిక్కెట్ ధర రూ.3,200గా నిర్ణయించామని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎండాకు వణుకు

- విజృంభిస్తున్న ఎండాకు తెగులు
- వరిపంటపై దాడి
- ఆందోళనలో రైతులు



ఎండాకు తెగులు ఆశించిన వరిచేను



క్రిమి సంహారక మందును పిచికారీ చేస్తున్న రైతులు

ఆలమూరు: ఖరీఫ్ సాగు చేతి కొచ్చే తరుణంలో ఎండాకు తెగులు వెంటాడుతోంది. ఇప్పటి వరకూ ప్రకృతి వైపరీత్యాలతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఇక పంట దుక్కుతుందని భావిస్తున్న సమయంలో ఎండాకు తెగులు అష్టకష్టాలు పెడుతోంది. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు, వరదల ప్రభావంతో ఈ తెగులు వ్యాప్తి చెందింది. దీంతో రైతులకు కంటి మీద కునుకు ఉండడం లేదు. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 1.58 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. భారీ వర్షాలు కురిసిన కొన్ని ప్రాంతాల్లో గడచిన నెల రోజుల నుంచి ఎండాకు తెగులు తీవ్రంగా ఉంది.

అన్నదాతల ఆందోళన

జిల్లాలోని పలు మండలాల్లో ముందుగా సాగు చేసిన వరి పంట ప్రస్తుతం కంకి గట్టి పడే దశలో ఉంది. ఆలస్యంగా వరినాట్లు వేసిన చోట్ల మాత్రం కంకి వేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ తెగులు సోకడం వల్ల అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడి సాయం అందించలేదు. రైతులు అప్పులు చేసి మరీ సాగును చేపట్టారు. పంట తుది దశలో హఠాత్తుగా ఎండాకు తెగులు సంభవించడంతో అన్నదాతలకు ఏమి చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. దీన్ని సరైన సమయంలో గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపడితే నివారణ సాధ్యమేననే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఈ తెగులు సోకిన చేలల్లో కొందరు రైతులు కాండం కుళ్లు లేదా దుబ్బు కుళ్లు తెగులుగా పొరబడి శిలీంధ్ర నాశినిలను పిచికారీ చేస్తున్నారని వ్యవసాయశాఖ నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల మరింత పంట నష్టం జరిగే అవకాశం ఉందన్నారు.

నిర్ధారణ తప్పనిసరి

వరిపైరుకు ఉన్న లక్షణాలను బట్టి ఎండాకు తెగులు సోకినట్లుగా గుర్తిస్తే ఆ మేరకు వ్యవసాయశాఖ సూచనలు, సలహాలను తీసుకోవాలి. వారి సలహాల మేరకు నష్టనివారణ చర్యలు తీసుకోవాలి. ఎండాకు తెగులును త్వరితగతిన నిర్ధారించి నష్ట నివారణ చర్యలు తీసుకుంటే సకాలంలో నివారించవచ్చు. వరిపైరుపై ఎండాకు తెగులు మూడు దశల్లో సోకుతుంది. జాంథో మోనాస్ ఒరైజ్ లేదా పాథోవోర్ ఒరైజ్ అనే బ్యాక్టీరియా వల్ల ఇది ఆశిస్తుంది. నారుమడి దశలో ఆకుల అంచుల నుంచి దాగు మచ్చలుగా ఏర్పడుతుంది. ఒక్కొక్క ప్రాంతంలో భూసారాన్ని బట్టి నారుమళ్లు వేసిన నెల రోజుల తరువాత కూడా సోకవచ్చు. తెగులు ఉధృతిగా ఉన్నప్పుడు దుబ్బులోని కొన్ని పిలకలు చనిపోతుంటాయి. ఎండిన ఆకులను ముక్కలుగా కత్తిరించి మంచినీటిలో ఉన్న గ్లాసులో వేసి అరగంట తరువాత నీటిని గమనిస్తే తెగులు సోకిన భాగాల నుంచి తెగులుకు సంబంధించి బ్యాక్టీరియా నీటిలో కలిసిపోయి పసుపురంగులోకి మారిపోతే ఎండాకు తెగులుగా గుర్తించాలి.



ఎండాకు తెగులు సోకిన వరి దుబ్బు

వాతావరణంలో మార్పులు

వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల వల్ల ఎండాకు తెగులు దశను మార్చుకుంటుంది. వరి పిలకలు వేసే దశలో కానీ, కంకి గట్టి పడే దశలో కానీ ఈదురు గాలులలో కూడిన వర్షాలు కురిస్తే ఈ వ్యాధి సోకుతుంది. 32 డిగ్రీల ఉష్ణోగ్రత కంటే తక్కువగా ఉన్న వాతావరణంలో మొక్కల సాంద్రత ఎక్కువగా పొలాల్లో సోకుతుంది. వరి సాగులో అధిక నత్రజని వాడితే ఈ ఎండాకు తెగులు సోకి పంటను తీవ్రంగా నష్టపర్చే అవకాశం ఉంటుంది. తెగులు ఉధృతిగా ఉన్న సమయంలో వరిదుబ్బులపై మచ్చలు తీవ్రత పెరిగి ఆకులన్నీ ఎండిపోయే అవకాశం ఉంటుంది. తెగులు సోకిన పొలాల్లో ఆకు ఉదయం పూట పసుపురంగులో ఉంటుంది. ఆకుపై జిగురు వంటి పదార్థం బిందువులుగా బయటకు ఉబికి వస్తుంది. ఎండ తీవ్రత పెరిగే కొద్ది క్రమేపీ బిందువులు ఎండిపోయి నీటిలో పడిపోవడం వల్ల మళ్లీ ఆకులు యథాస్థితికి చేరుకుంటాయి. సాగునీటి ద్వారా ఒక పొలం నుంచి మరో పొలానికి వ్యాప్తి చెందుతుంది.

అవగాహనతోనే నివారణ సాధ్యం

వ్యవసాయశాఖ సూచనలు, సలహాలతో పాటు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఎండాకు తెగులును సకాలంలో నిర్మూలించడం సాధ్యమేనని జిల్లా వ్యవసాయాధికారి ఓలేటి బోసుబాబు చెబుతున్నారు. ఆయన చేసిన సూచనల ప్రకారం..

- వ్యవసాయశాఖ నిర్దేశించిన మోతాదులో మాత్రమే నత్రజనిని వినియోగించాలి.
- వాతావరణ పరిస్థితుల్లో మార్పులు సంభవిస్తే నత్రజని ఎరువుల వాడకాన్ని సత్వరమే నిలిపివేసి, మళ్లీ ఎండ కాసిన తరువాత పునఃప్రారంభించాలి.
- వ్యవసాయశాఖ సిఫారసు చేసిన పొటాష్‌ను మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో రెండు దఫాలుగా నాట్లు వేసే సమయంలో ఉపయోగించాలి.
- పొలం గట్ల వెంబడి అక్కడక్కడ ఉండే కలుపు మొక్కలను తొలగిస్తే తెగులు సోకే బ్యాక్టీరియా వ్యాప్తి చెందే అవకాశం ఉండదు.
- పొలం చుట్టూ చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- ఎండాకు తెగులు సోకిందని భావిస్తే పొలంలో అప్పటి వరకూ ఉన్న సాగునీటిని రెండు లేదా మూడుసార్లు బయటకు పంపించి వేసి మళ్లీ కొత్తగా నీరును నింపుకోవాలి.
- ఎకరాకు 20 కేజీల పొటాష్‌ను వరిపైరు పూర్తిగా అందే వరకూ పైపాటుగా ఉపయోగించాలి.
- కాపర్ హైడ్రాక్సైడ్ మందును రెండు గ్రాములు లేదా కాపర్ సల్ఫేట్ రెండు మిల్లీలీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఈ విధంగా పది రోజుల వ్యవధిలో రెండుసార్లు చేస్తే ఎండాకు తెగులు నుంచి పూర్తిగా బయటపడవచ్చు.

కాకినాడలో కూటమి నాయకుల కొట్లాట



గోడి వెంకట్‌పై దాడి చేస్తున్న టీడీపీ నాయకులు

కాకినాడ: కూటమి ప్రభుత్వంలోని ఇద్దరు నాయకుల మధ్య జరిగిన కొట్లాట పోలీసుస్టేషన్ వరకూ వెళ్లింది. వివరాల్లోకి వెళితే.. కాకినాడ గాంధీనగర్‌లోని కొయ్యలవారివీధి ప్రాంతానికి చెందిన స్థానికులు పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదంటూ ప్రజారోగ్య విభాగానికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎంహెచ్‌వో ఆదేశాల మేరకు ఆ ప్రాంతానికి చెందిన శానిటరీ ఇన్‌స్పెక్టర్, పారిశుధ్య సిబ్బంది, స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులతో కలిసి వెళ్లారు. అయితే స్థానికులు, అక్కడకు వెళ్లిన సిబ్బంది, ఇతర టీడీపీ కార్యకర్తలు ఫిర్యాదు చేసిన సిబ్బందిపై విరుచుకుపడ్డారనే సమాచారం. దీంతో సమస్యను పరిష్కరించకుండా ప్రజలను బెదిరించడం ఏమిటంటూ మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి భర్త, బీజేపీ నాయకుడు గోడి వెంకట్ ప్రజలకు మద్దతుగా వెళ్లారు. అతడిపై టీడీపీ నాయకుడు జొన్నాడ వెంకట రమణ దాడికి యత్నించారు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి., ఘర్షణ వాతావరణం నెలకొంది. స్థానికులు సర్దిచెప్పడంతో ఇరువర్గాలు అక్కడి నుంచి వెళ్లిపోయాయి. అనంతరం గోడి వెంకట్ తనపై దాడి చేశాడంటూ టీడీపీ నాయకుడు వెంకట రమణ పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు ఇరువర్గాలనూ రాజీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుల అరెస్టు



నిందితులను విలేకరులకు చూపిస్తున్న పోలీసులు

పిఠాపురం: బాలికపై అత్యాచారం కేసులో నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం తన కార్యాలయంలో నిందితులను మీడియా ముందు హాజరుపరిచారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పిఠాపురం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 16 ఏళ్ల బాలికను ఈ నెల 7వ తేదీ సాయంత్రం ఆటో డ్రైవర్, అతడి స్నేహితురాలు కిడ్నాప్ చేశారు. ఆటోలో మాదాపురం గ్రామ శివారులోని డంపింగ్ యార్డు సమీపంలోని గోదావరి కాలువ గట్టు వద్దకు తీసుకువెళ్లారు. బాలికకు బలవంతంగా మద్యం పట్టించారు. అనంతరం ఆటో డ్రైవర్ అత్యాచారం చేశాడు. ఈ సంఘటనపై పిఠాపురం టౌన్ పోలీస్ స్టేషన్లో నమోదైంది. ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ రఘువీర్ విష్ణు పర్యవేక్షణలో కేసులో నిందితులను పట్టుకోవడానికి మూడు బృందాలను ఏర్పాటు చేసి గాలించారు. పిఠాపురం అయితే నగర్‌కు చెందిన దుర్గాలక్ష్మయ్య అలియాస్ జాన్, ఇందిరా నగర్‌కు కొంగుపూడి సుబ్బలక్ష్మిలను బుధవారం గొర్స రోడ్డులోని రైస్‌మిల్లు సమీపంలో అరెస్టు చేశారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరిచారు. నిందితుడి నుంచి ఆటో, దుస్తులు, మద్యం సీసాను స్వాధీనం చేసుకున్నారు.

టీడీపీ నాయకుడి ఇంట్లో తెలంగాణ మద్యం

6,144 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యాన్ని పరిశీలిస్తున్న సీఐ చెన్నకేశవరావు, ఎస్సై కృష్ణమాచారి



మద్యం సీసాలు, నిందితుడితో ఎస్సై కృష్ణమాచారి, సిబ్బంది

తుని రూరల్: కాకినాడ జిల్లా తుని మండలం కేఓ మల్లవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సుర్ల గోవిందరాజులు ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన తెలంగాణ మద్యం సీసాలను రూరల్ పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం రాత్రి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ చెన్నకేశవరావు, ఎస్సై బి.కృష్ణమాచారి తుని మండలం ఎస్.అన్నవరం శివారు శేషాద్రినగర్‌లో నివాసం ఉంటున్న సుర్ల గోవిందు ఇంట్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. దీంతో రూ.2,45,760 విలువ చేసే 128 కేసుల (6,144 క్వార్టర్ బాటిళ్లు) తెలంగాణ మద్యాన్ని గుర్తించారు. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గోవిందరాజులు భార్య ఎంపీటీసీ సభ్యురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొద్దిరోజులకే టీడీపీలో చేరారు. పిల్లలు చదువుల పేరుతో తుని మండలం ఎస్.అన్నవరం శివారు శేషాద్రినగర్‌లో నివాసం ఉంటున్న గోవిందరాజులు ఇంట్లో పెద్ద ఎత్తున మద్యం నిల్వలు లభించాయి. ఖమ్మం, వరంగల్ నుంచి తెలంగాణ మద్యం జిల్లాకు వచ్చిన సమాచారంతో సాధారణ తనిఖీలు నిర్వహించిన పోలీసులకు అక్రమ మద్యం నిల్వలు లభించాయి. ఇందుకు బాధ్యులైన గోవిందరాజులు, పసగడుగుల చీడిగిత ల్లిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యాన్ని రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై లోతుగా విచారణ చేస్తున్నామని, అక్రమ వ్యాపారాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్టు సీఐ తెలిపారు. అక్రమార్కులు ఏ పార్టీ అయినా విడిచిపెట్టేది లేదని, మద్యం మాఫియాను ఉపేక్షించబోమని హెచ్చరించారు. తనిఖీల్లో మరిన్ని నిల్వలు బయటపడే అవకాశాలు ఉన్నాయని, అధికార పార్టీ నాయకులు మరింత మంది ఉన్నట్టు తెలుస్తోంది.

మద్యం సీసాలతో ఇద్దరు టీడీపీ కార్యకర్తల అరెస్టు

తుని మండలం కేఓ మల్లవరంలో అక్రమంగా మద్యం సీసాలు కలిగి ఉన్న ఇద్దరు టీడీపీ కార్యకర్తలను తుని రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని రెండు ప్రాంతాల్లో పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. ఈ సందర్భంగా గాలి గోవిందు వద్ద 94 బాటిళ్లు, గాలి కృష్ణ వద్ద 72 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు.

నేటి నుంచి బాస్కెట్ బాల్ పోటీలు

రామచంద్రపురం: కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో గురువారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకూ 9వ సబ్ జూనియర్స్ అంతర జిల్లాల బాస్కెట్ బాల్ పోటీలు జరగనున్నాయి. మాజీ లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి జ్ఞాపకార్థం వీటిని నిర్వహిస్తున్నట్టు ఏపీ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, రామచంద్రపురం బాస్కెట్ బాల్ అధ్యక్షుడు డాక్టర్ సి.స్టాలిన్ తెలిపారు. ఈ పోటీలను ఉదయం 9 గంటలకు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభిస్తారన్నారు. ఈ నెల 12న జరిగే ముగింపు సభలో ఎంపీ గంటి హరీష్ మాధుర్, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ పాల్గొంటారన్నారు.

ఇంద్రకీలాద్రిపై గరగ నృత్యం



కనకదుర్గమ్మ ఆలయం వద్ద ప్రదర్శన ఇస్తున్న గరగ నృత్య కళాకారులు (ఫైల్)

అంబాజీపేట: శరన్నవరాత్రుల సందర్భంగా విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న కనకదుర్గమ్మ ఉత్సవాలలో ముక్కామలకు చెందిన గరగ నృత్య కళాకారులు ప్రదర్శన ఇచ్చారు. ఈ నెల 6, 7, 8 తేదీలలో జరిగిన వాహన సేవలో వీరందరూ పాల్గొన్నారు. ఆలయ ఈవో నుంచి వచ్చిన ఆహ్వానం మేరకు పసుపులేటి నాగబాబు ఆధ్వర్యంలోని విజయదుర్గ నాట్యబృందం (కళాకారులు) విజయవాడకు తరలివెళ్లింది.

రెండు బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు

మండపేట: రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. గొల్లపుంత కాలనీకి వెళ్లే రోడ్డులో బుధవారం ఈ ప్రమాదం జరిగింది. వేదరాజు సత్యనారాయణ రాజు ద్విచక్ర వాహనంపై మండపేట మార్కెట్‌కు వచ్చి తిరిగి గొల్లపుంత కాలనీలోని తన ఇంటికి బయలు దేరాడు. అదే సమయంలో కాలనీ నుంచి పెదప్రోలు వికాస్, మణి మోటారు సైకిల్‌పై వేగంగా వచ్చి సత్యనారాయణరాజును ఢీకొట్టారు. విషయం తెలుసుకున్న టౌన్ ఎస్సై హరికోటి శాస్త్రి హుటాహుటిన సంఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. క్షతగాత్రులను వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఢీ కొట్టిన యువకులిద్దరికీ స్వల్పంగా, సత్యనారాయణరాజుకు తీవ్ర గాయాలయ్యాయి.

జాతీయ పోటీలలో సత్తా చాటాలి



ప్రథమస్థానంలో నిలిచిన చిత్తూరు జట్టు

రాజానగరం: అంతర్ జిల్లాల స్థాయిలో క్రీడా పోటీలలో పాల్గొన్న వారందరూ మరింత ప్రతిభను కనబరచి, జాతీయ స్థాయిలో సత్తా చాటాలని డిప్యూటీ డీఈఓ ఈవీఈఎస్ఎస్ఎన్‌బీఎల్ నారాయణ అన్నారు. దివాన్ చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ఏపీ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న 68వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. బాలుర అండర్ 17 కేటగిరీలో హోరాహోరీగా జరిగిన ఈ పోటీలలో విజేతలకు ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో చిత్తూరు, ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం, తృతీయ స్థానంలో తూర్పుగోదావరి జట్లు నిలిచాయి. ఈ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తామని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి తెలిపారు. ఈ మేరకు ఎంపికైన 16 మంది క్రీడాకారుల వివరాలు వెల్లడించారు. వారిలో కాకూరి తేజసాయిరెడ్డి, తంగరాజు, మిడపాల యోగేశ్వర్ (చిత్తూరు), రాజనాల వెందత్తసాయి, చిన్ని ధిల్లేశ్వరరావు (శ్రీకాకుళం), కొల్లాబత్తుల షెల్విక్, అంగారపు వెంకట్ గణేష్ (తూర్పు గోదావరి), ఆకుల దేవ్ సూర్యసాయి (విశాఖపట్నం), పిల్లా దేవి చరితసత్య (ప్రకాశం), పిడిది జశ్వంత్ (విజయనగరం), ముడే ప్రసాద్ నాయక్ (కర్నూల్), దాసరి జాషువా (నెల్లూరు), వనం గౌరీశంకర్ (విశాఖపట్నం), మోపిదేవి తాన్విత (కృష్ణ), అద్దంకి రాజ్‌పాల్ (గుంటూరు), కత్తిక చైతన్యకుమార్ (తూర్పు గోదావరి) ఉన్నారు. కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యానికేతన్ కరస్పాండెంట్ విజయ్‌ప్రకాష్, పరిశీలకులు ఎంవీ నాగేంద్ర, ప్రిన్సిపాల్ విమల, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, మేనేజర్ ఎఎస్ఎన్ మూర్తి, ఉపాధ్యాయ సంఘ కార్యదర్శి ఎస్.నాగరాజు, వీరబాబు, గంగాధర్ పాల్గొన్నారు.

ఆలయానికి రూ.30 లక్షల భూమి దానం



భూమిదాన పట్టా నమూనాను అందజేస్తున్న రెడ్డి ఆదిమూర్తి దంపతులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడలోని బాలా త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి నగరానికి చెందిన రెడ్డి ఆదిమూర్తి, అనురాధ దంపతులు 50 సెంట్ల భూమిని బుధవారం దానం చేశారు. ఈ భూమి దానపట్టాను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సమక్షంలో అందజేశారు. జగ్గంపేట మండలం కాండ్రేగుల గ్రామంలో ఉన్న ఆ భూమి విలువ రూ.30 లక్షలు ఉంటుంది. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఈఓ వీర్రాజు చౌదరి అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జి పాల్గొన్నారు.